# వంటింటి లెక్చర్లు (5)
# వండర్ గర్ల్లా నేచురల్లీ ఖాన్

మంచివాళ్లు ఎందుకో ఎవరికీ అర్థంకారు. మెత్తని మనసున్న వాళ్ళతో చాలా తంటాలున్నాయి. లోపాలులేని మనుష్యులుంటారంటే ఎవరూ నమ్మరు. కొందరికి వారి మంచితనమే లోపం, అంచాత చెడ్డ వాళ్లనబడే వాళ్ళతోకంటే మంచివాళ్ళతో మెసులుకోడం పరమ కష్టం, ట్రయి చెయ్యండి, మా జానకిరావుడు పిన్ని మూడో కూతురు సుబ్బలక్ష్మి ఒక ఉదాహరణ. దాన్ని మా వాళ్ళంతా 'వండర్ గర్ల్' అని పిలుస్తారు, వండర్ బాయిస్ వున్నట్లుగానే వండర్ గరల్సు కూడా వుంటారు.

సుబ్బలక్ష్మికి ప్రతి చిన్న విషయం అద్భుతమే, ఆశ్చర్యమే, వండరే—అబ్బ ఈ చీమ చూడత్తయ్యా అని నేలమీద ప్రాకుతున్న చీమని చూస్తూ "దీనికెందుకింత తాపత్రయం ? అయ్యో పడిపోయింది" అని వాపోతుంది. చీమలు పిండో, పంచదార పలుకో ఏదో మోసుకెళ్తాయికదా- దారిలో మరో చీమ కనిపిస్తే ఆగి మూతీ మూతీ తగిలించి మాట్లాడుకుని మళ్ళీ వాటిదారినవి వెళ్ళిపోతాయి కదా—అవన్నీ ఆశ్చర్యంగా చూస్తుంటే సుబ్బలక్ష్మిని గురించి ఏమనుకోవాలి ? ఎవరైనా కొత్త చీర కట్టుకుంటే "అబ్బ! ఎంత బావున్నారండీ, అబ్బ అంచెంత బాగుందండీ" అని మెచ్చు కోకుండా వుండలేదు. పిల్లలు కొత్త పుస్తకాలు తెచ్చుకుంటె 'నన్నో మాటు

ముట్టుకోనివ్వంద్రా' అని పుస్తకాలు తడిమి వాటిని వాసనచూసి "బాగున్నా యగ్రా బాగున్నాయి" అని అట్టలు వేసి పెడుతుంది. రోడ్డుమీద కూరల వాళ్లు కావిళ్ళతో వెళ్తూంటే "అబ్బ కూరలెంత బావున్నాయో" అని అది ఒక వింతలా ఆశ్చర్యపోతుంది. పిట్టలెగురుతున్నాయనుకోండి. "అబ్బ ! ఎంత ఎత్తుగా ఎగురుతున్నాయి ? మనం ఎగరగలమా — ఆశ్చర్యం" అంటుంది. పిచికలు వెంటి లేటర్లో గూళ్లు కడుతూంటే "అబ్బ యివి గూడు ఎంత చక్కగా కట్టాయో" అని పొంగిపోతుంది. పూలమ్మే కుర్రాడు వీధిలో అరుస్తూపోతూ వుంటే 'అబ్బపూలు ఎంత బావున్నాయి' అని చూసి ఆనందిస్తుంది. ఇల్లా ప్రతి చిన్న విషయానికీ సంతోషించటం మంచి తనమా లేక మరోటా—అంటే వెర్రిబాగుల్తన వంటారా? ఏమో .... మరి



మనకు అన్నీ సామాన్యంగానే వుంటాయ్ - ప్రతీదీ మెచ్చుకోడం ప్రతీదీ బాగుందనడం చెడ్డ లక్షణం ఎల్లా అవుతుంది ? మా సుబ్బలక్ష్మికి అన్ని సినిమాలూ బాగుంటాయి. అన్ని పుస్తకాలూ, అందరు మనుష్యులూ బావుంటారు, ఇది అమాయకత్వమా, గడుసుతనమా?

కాకి అరుస్తే "అబ్బ కాకి ఎలా అరుస్తుందో" అంటుంది. వాళ్ళా

యన సిగరెట్ కాలుస్తూంటే "అబ్బ ఎంత చక్కగా కాలుస్తారో" అని చూస్తూ నిలబడిపోతుంది.

సెన్స్ ఆఫ్ వండర్ లేకపోతే లోకం చాలా భయంకరంగా జిడ్డుగా కనిపిస్తుంది. సుబ్బలక్ష్మి మాటలకి అందరూ నవ్వుకుంటారు. కాని, ఆ అమ్మాయి కెవరూ శత్రువులు కూడా లేరు. సుబ్బలక్ష్మి మొగుడు దత్తు అదంటే పడిచస్తాడు. "ఏవండీ ఒక మాటు నడవండి" అంటుంది. అతను నడిచి చూపిస్తాడు. "అబ్బ మీరు నడుస్తుంటే చూడ ముచ్చటగా వుంటుందండీ" అని కాంప్లిమెంటు చేస్తుంది. కొత్త చొక్కా కుట్టించుకుని తొడుక్కున్నప్పుడు పనిచేయించుకున్నప్పుడు, పెన్నుతో రాసుకునేటప్పుడు, ఏదన్నా చదువు కొంటున్నప్పుడు "వింత"గా మొగుడ్ని చూస్తూ ఆ ముక్కలు పైకి అనేస్తూ వుంటుందది. "నువ్వు చాలా మంచిదానవు సుబ్బులూ-నీకు లోకమంతా ట్వింకిల్ ట్వింకిల్ లిటిలిస్టార్ లా కనినిస్తుంది" అని దాన్ని మెచ్చుకుంటూ వుంటాడు దాని భర్త.

మా సుబ్బలక్ష్మికి సరిగ్గా వ్యతిరేకం మా మామయ్య కొడుకు అనంతం. వాడు మా సుబ్బలక్ష్మి దేన్ని మెచ్చుగుంటే దాన్నల్లా తిట్టిపోస్తాడు. చిత్రం ఏవిటంటే అనంతాన్ని కూడా మెచ్చుగుంటుంది సుబ్బలక్ష్మి. "మా బావ అలా అంటాడు కాని చాలా తెలివైన వాడు" అనో - "తప్పు బావా అలా అనకు" అనో అది బతిమాలుతుంది తప్ప ఎవర్నీ ద్వేషించదు.

అనంతం చాలా పెడసరంగా మాట్లాడుతాడు. ముందు వాడికిస్తామన్నారు సుబ్బలక్ష్మిని. "నల్లగా వుంటుంది. వెర్రిది" అన్నాడు వాడు. "నువ్వు వెర్రిదాన్ని చేసుకోలేదు బతికిపోయావ్ బావా-" అంటుందది తన మొగుడెదురుకుండానే. సుబ్బలక్ష్మి భర్తకి అనంతం సుబ్బలక్ష్మిల సంవాదం వినడమంటే చాలా సరదా.

అనంతం పత్రిక చదువుతూండగా గడప దగ్గిర బియ్యం ఏరుకుంటూ సుబ్బలక్ష్మి కూర్చుని "పత్రికలో విశేషాలేవిటి బావా" అంటుంది.

"ఆ ఏమున్నాయ్, మామూలే—బస్సుల క్రింద లారీల క్రింద మను

ష్యలు పడటం - స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోవటం - దొంగతనాలూ దోపిడీలూ-"

"అయ్యో! అయ్యో! ఎవరైనా ఎందుకు దొంగతనాలు చేస్తారు? ఎవరైనా ఎందుకు ప్రాణాలు తీసుకుంటారు? ఏదో పాపం" అని జాలిపడు తుంది.

అనంతం ఒక కాయితం తీసి "ఇదుగో చూడు" అని ఆమె ముందుకు నెడతాడు. సుబ్బలక్ష్మి పత్రిక చదవటం మొదలెడితే ఆమెకి అంతా ఆశ్చర్యమే —

"అయ్యో! అయ్యో! బావా రైలుపడిపోయింది. వందలాది మందికి గాయాలట, పదిమంది చనిపోయారట-" అని వాపోతుంది.

అనంతం నిర్లిప్తంగా-

"రైలు పడిపోతే మనుష్యులు చావరా, నీ వెర్రిగాని" అంటాడు.

"అయ్యో, అయ్యో, తుపాకులు కాల్చారట పోలీసులు మూకల పై" అని బాధపడుతుంది.

"బాధపడకే—మూకలు రాళ్ళు విసిరినప్పుడు పోలీసులు కాల్చరా — కాలిస్తే మరి ఎవరో ఒకరు చావటం నేచురల్ సుబ్బులూ" అంటాడు.

"కొత్తగా కట్టిన వంతెన కూలిపోయిందిట — రామ ! రామ !" అంటుంది సుబ్బలక్ష్మి.

"కూలిపోదా కట్టినపుడు సరిగ్గా కట్టకపోతే"

"వరదలొచ్చి ఇళ్ళన్నీ కొట్టుకుపోయాయట-"

"నేచురల్లీ - వరద లొచ్చినపుడు ఇళ్లు కొట్టుకుపోతాయి. దానికి ఆశ్చర్యం దేనికి?"

"రాధకి మగపిల్లాడ విన్నావా?" అంటుంది సు.

"నేచురల్లీ, దానికి పెళ్ళయింది. కాపరానికెళ్ళింది. కడుపొచ్చింది.

పిల్లాడు పుట్టాడు—పిల్లాడో పిల్లో పుట్టకుండా వుంటారా?" అంటాడు అ.

"ఈ కథ చూశావా బావా ఎంత బాగుందో?"

"బాగుండదుంటే వెర్రిదానా ? బాగులేకపోతే ఎందుకు వేస్తారు పత్రికలో."

"ఏవిటిబావా ప్రతిదానికీ నువ్వలామాట్లాడుతావు ?"

"సర్లె, నేను తెలివైనవాణ్ణి కాబట్టి నీలా వండర్‌బోయిని కాను కాబట్టి జాగ్రత్తగా ప్రతిదీ పరిశీలించి తెలుసుకున్నాక అభిప్రాయాలేర్పరచు కుంటున్నాను, నా కన్నీ తప్పులే కనిపిస్తాయి."

"అదేవిటి బావా? లోకం యింత మంచిది కాబట్టే మనం ఇందులో వుండగలుగుతున్నాం."

"అదేవిటే సుబ్బులూ – మనం తెలివైన వాళ్ళం. కాబట్టి ఈ లోకంతో పోరాడి నెగ్గుకొస్తున్నాం. ఈ లోకం పాపిష్టిది నేచురల్లీ."

వాళ్ళిద్దరి సంభాషణా సమాంతర రేఖల్లా కలియకుండా అలా సాగి పోతూ వుంటుంది. లోకంలో సుబ్బలక్ష్మిలాటి వండర్ గరల్సున్నట్లే, అనంతంలాటి నేచురల్లీఖాన్‌లు కూడా వుంటారు.